## క్లుప్తంగా

### 'కంటే' కుటుంబానికి దొరబాబు పరామర్శ



కంటే వీర్రాఘవరావును పరామర్శిస్తున్న కో–ఆర్డినేటర్ దొరబాబు

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల వీర్రాఘవరావు చిన్నాన్న కంటే నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో కో–ఆర్డినేటర్ దొరబాబు ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వీరంరెడ్డి నాని తదితరులున్నారు.

### చంద్రశేఖర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న దేవగురు చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న గొరకపూడి

సామర్లకోట: అతి చిన్న వయస్సులో డాక్టరేట్ బిరుదు పొందడం అభినందనీయమని భారత మాత సేవా పరిషత్ జిల్లా అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. సామర్లకోటకు చెందిన దేవగురు చంద్రశేఖర్‌కు ఢిల్లీకి చెందిన ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ అకాడమీ ఇటీవల దేవగురు చంద్రశేఖర్‌కు డాక్టరేట్ బిరుదు ఇచ్చింది. ఈ మేరకు ఆయనను గొరకపూడి చిన్నయదొర అభినందించారు. చంద్రశేఖర్ ఆపదలో ఉన్న అనాథలకు తన స్నేహితుల ద్వారా సహాయ కార్యక్రమాలు నిర్వహించి గుర్తింపు పొందారు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలకు డాక్టరేట్ బిరుదు లభించింది.

### ఎంపీడీఓగా హిమామహేశ్వరి



బాధ్యతలు స్వీకరించిన హిమామహేశ్వరి

సామర్లకోట: మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.హిమామహేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అధికారుల బదిలీల ప్రక్రియలో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ డి.శ్రీలలితను పెద్దాపురం బదిలీ చేశారు. ఆమె శనివారం ఉదయం రిలీవ్ కావడంతో ఆమె స్థానంలో అనపర్తి మండలం నుంచి బదిలీపై వచ్చిన హిమామహేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా పని చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓను ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

### పెద్దాపురం ఎంపీడీఓగా శ్రీలలిత



పెద్దాపురం ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీలలిత

పెద్దాపురం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా డి.శ్రీలలిత శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ ఎంపీడీఓగా కొనసాగిన బి.అశోక్‌కుమార్ నుంచి ఆమె బాధ్యతలను తీసుకున్నారు. ఆమె సామర్లకోట ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆమెకు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## సినిమాలు

| | |
|---|---|
| **పెద్దాపురం** | |
| లలితా స్క్రీన్–1 | దేవర |
| లలితా స్క్రీన్–2 | సత్యం సుందరం |
| వీరభద్ర | దక్షిణ |
| శోభా | శ్వాగ్ |
| **సామర్లకోట** | |
| అనుశ్రీ స్క్రీన్–1 | దేవర |
| అనుశ్రీ స్క్రీన్–2 | దేవర |
| విఘ్నేశ్వర | సత్యం సుందరం |
| **పిఠాపురం** | |
| అన్నపూర్ణ | శ్వాగ్ |
| శ్రీపూర్ణ | దేవర |
| శ్రీసత్య | సత్యం సుందరం |
| శ్రీవెంకటేశ్వర | మిస్టర్ సెలబ్రిటీ |
| **ఉప్పాడ** | |
| శ్రీనివాస | దేవర |

# ప్రయాణం.. నరకప్రాయం

- అభివృద్ధికి నోచుకోని లింకు రోడ్డు
- భూమిపూజ చేసినా పూర్తి కానీ గోరింట–మల్లాం రహదారి
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



గోతులతో దర్శనమిస్తున్న గోరింట–మల్లాం రహదారి

పెద్దాపురం: డివిజన్ కేంద్రమైన పెద్దాపురం పట్టణానికి వచ్చే లింకు రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని కూటమి నేతలు ప్రకటనలు చేస్తున్నారే తప్పా పనులపై దృష్టి సారించడంలేదు. ఆ రహదారి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో భూమిపూజ చేశారు. ఇప్పటికీ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. గతంలో తామే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామంటూ ప్రచారం చేసిన టీడీపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకున్న దాఖలాల్లేవు అనడానికి ఈ రహదారి నిదర్శనం.

**అధ్వానంగా రహదారి**

పెద్దాపురం, పిఠాపురం సెగ్మెంట్లను కలిపే గోరింట–మల్లాం రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో గోరింట, మల్లాం గ్రామాల ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. 2014లో టీడీపీ హయంలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కూడా చేశారు. కానీ రోడ్డు నిర్మాణ పనులు మాత్రం నిలిపివేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతులు పనులు జరిగాయి. తదుపరి వర్షాల కారణంగా రహదారి మరింత గుంతలు పడి నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. గోరింట గ్రామానికి చెందిన హైస్కూల్ విద్యార్థులు పిఠాపురం మండలం మల్లాంలోనే విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థులు ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇక వర్షా కాలం కావడంతో ఈ రెండు గ్రామాల ప్రజల అవస్థలు వర్ణనాతీతం. గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరించడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఇబ్బంది పడుతున్నాం

మండల కేంద్రమైన పెద్దాపురం నుంచి గోరింట మీదుగా మల్లాం వెళ్లేందుకు ఈ రోడ్డు ప్రధానం. రోడ్డు బాగోలేక రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. ఈ రోడ్లు అభివృద్ధి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. లింకు, పుంత రోడ్లు అభివృద్ధి చేస్తే ప్రయాణానికి సులవవుతుంది. ప్రస్తుత పాలకులు, అధికారులు రహదారి నిర్మాణంపై దృష్టి సారించి ప్రజల కష్టాలను తీర్చాలి



–గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ చైర్మన్, పెద్దాపురం

### ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి

ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో లింక్ రోడ్డు నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి. గోరింట నుంచి మల్లాం రహదారిల నిర్మాణాల విషయం రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి. సంబంధిత మంత్రి, అధికారులతో మాట్లాడి త్వరితగతిన రోడ్డు నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలి.



– సొన్నాయిల దుర్గా జ్యోతి, గృహిణి, మల్లాం, పిఠాపురం మండలం

### టీటీడీసీలో 8న జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో ఈనెల 8వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాసు, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు తెలిపారు. జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, సిడప్‌ల సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ జాబ్ మేళాకు బ్లూట షన్ బయోటెక్, పేటీఎం, ఇనోవ్‌సోర్స్, జీఫే సంస్థల ప్రతినిధులు హాజరు అవుతారన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ బయోడెటా, ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో మంగళవారం ఉదయం 10 గంటలకు టీటీడీసీ వద్దకు హాజరు కావాలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో సిడప్ జేడీఎం కిరణ్ పాల్గొన్నారు. మర్ని వివరాలకు 94407 56250 లేదా 99491 56583లకు సంప్రదించవచ్చునని తెలిపారు.

### 7 నుంచి ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

సామర్లకోట: పంచాయతీ రాజ్ చట్టంపై అవగాహన పెంచుకోవడానికి మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు ఈనెల 7, 8వ తేదీల్లో శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఐఆర్‌డీ, డైరెక్టరు ఆదేశాల మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఇప్పటికే విస్తరణ శిక్షణా కేంద్రంలో మాస్టరు ట్రైనర్లుగా శిక్షణ పొందిన ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు వీరికి శిక్షణ ఇస్తారు. సాధారణ కనీస పరిపాలనా విధానం, పంచాయతీ చట్టం నిబంధనలు, పారిశుధ్యం, తాగునీరు వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు.

## పద్మరాజు సేవలు అభినందనీయం

- వైఎస్సార్ సీపీ పెద్దాపురం కో–ఆర్డినేటర్ దొరబాబు



పద్మరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దొరబాబు

పెద్దాపురం: గ్రామ సర్పంచ్‌గా ఎన్నో సేవలందించిన మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు మిరియాల పద్మరాజు చేసిన సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని మర్లావ గ్రామ మాజీ సర్పంచ్, మండల మాజీ ఉపాధ్యక్షుడు పద్మరాజు వర్ధంతి శనివారం జరిగింది. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్‌లతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తనయుడు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడారు. తొలుత పద్మరాజు విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాతా శంకరరావు, మేడిబోయిన కాశీ, వేమన వెంకటేశ్వరరావు, నరాలశెట్టి త్రినాథ్, వేమన వెంకటరమణ, పడాల నాగు, జి.దొరబాబు, నల్లంశెట్టి మనేష్, కామన చక్రరావు తదితరులు పాల్గొన్నారు.

### ఈఓపీఆర్డీగా సత్యరెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న హరికృష్ణసత్యరెడ్డి

కొత్తపల్లి: స్థానిక ఈఓపీఆర్డీగా కర్రి హరికృష్ణ సత్యరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా సామర్లకోట నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేసిన భాస్కరరావు జగ్గపేటకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఈఓపీఆర్డీ సత్యరెడ్డికి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల తాకిడి

- శనివారం ఒక్కరోజే స్వామి వారికి రూ.3.83 లక్షల ఆదాయం



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలికలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.3,83803 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 16 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా సుమారు మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, మొయిళ్ల రాయన్న, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పట్టవా ?

- మండల సమావేశానికి హాజరుకాని ప్రజా ప్రతినిధులు
- సభ్యులు, అధికారుల గైర్హాజరుతో ఆలస్యంగా ప్రారంభమైన వైనం
- సమావేశం ముగియకుండానే ఖాళీ అయిన కుర్చీలు



సమావేశం ముగియకుండానే ఖాళీ అయిన కుర్చీలు

కొత్తపల్లి: గ్రామాల్లోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కాకపోవడంతో 11.30 గంటలకు ప్రారంభమైంది. 18 మంది సర్పంచులకు గానూ ఏడుగురు, 24 మంది ఎంపీటీసీలకు 10 మంది మాత్రమే హాజరయ్యారు. పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను తెలియపరిచారు. గ్రామాల్లోని సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. సీజనల్ వ్యాధులపై గ్రామా ల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్టు కొత్తపల్లి, నాగు లపల్లి, కొమరగిరి పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు. మండల వ్యవసాయాధికారి జోగిరాజు మాట్లాడుతూ ఏలేరు వరద ఉధృతి కారణంగా మండలంలో సుమారు 5,932 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. పంట నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇటీవల ఎకరాకు రూ.10 వేలు చొప్పున పరిహారం జమైందని చెప్పారు. ఆర్అండ్‌బీ జేఈ ఫణి మాట్లాడుతూ ప్రధాన రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. గోర్సలో అంగన్ వాడీ భవనం లేక అద్దె గదుల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారని, సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామ సర్పంచ్ రొంగల వీరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణం కోసం రుణాలు ఎప్పుడు మంజూరు చేస్తారని కుతుకుడుమిల్లి సర్పంచ్ కర్రి చిన్నారావు హౌసింగ్ అధికారులను నిలదీశారు. పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కారే సుధ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, ఎంపీడీవో వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధ

## నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలి



సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు

సామర్లకోట: ప్రతి ఒక్కరూ తాము నివాసం ఉండే, పని చేసే, ప్రయాణం చేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ దేశ వ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలో ప్రారంభమైన స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం రైల్వే స్టేషన్ పరిధిలోని కార్యాలయాలను శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు కార్యాలయాలను పరిశుభ్రం చేశారు. అదే విధంగా సామర్లకోట స్టేషన్‌లో ఆగిన రైళ్లకు సంబంధించి టిక్కెట్ చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్లకు బోగీలు శుభ్రంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. సామర్లకోటలో ఆగిన తిరుపతి–కాకినాడ ఎక్స్ ప్రెస్‌లోను, గుంటూరు–విశాఖపట్నం, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ల బోగిలలో ప్రయాణికులకు స్వచ్ఛ పక్వాడాపై అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. ప్రయాణికులు చెత్త కుండీలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కెవీ గిరి, టిక్కెట్ చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణేశ్వరి నమోస్తుతే..

- అన్నపూర్ణ అలంకరణలో దర్శనమిచ్చిన జగన్మాత
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలు నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా జగన్మాత దుర్గాదేవి అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల సందర్భంగా దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. నియోజకవర్గంలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలో కనకదుర్గ ఆలయాల్లో మూడోరోజు ప్రత్యేక పూజలు నిర్వహిరచారు. పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అదిష్టాన దేవతైన పురూహూతికా అమ్మవారికి శనివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**తాటిపర్తిలో..**


గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వెలసిన అపర్ణాదేవి అమ్మవారు మూడో రోజు చంద్రఘంట అవతారంలో యాలికులు, లవంగాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాడ శివాలయంలో లలితామాత తులసి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు.

పెద్దాపురం: స్థానిక వర్జుల వారి వీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో శనివారం భువనేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

**నూకాలమ్మ, మరిడమ్మ అమ్మవార్లు**

కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు శనివారం అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయ కార్యనిర్వాహణాధికారిలు సౌజన్య, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను అన్నపూర్ణదేవి అవతారంలో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

కొత్తపల్లి: మండలవ్యాప్తంగా శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన కనకదుర్గ అమ్మవారికి శనివారం ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా కొమరగిరిలో వేంచేసిన బాలకనకదుర్గా అమ్మవారు శనివారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



అన్నపూర్ణదేవి అవతారంలో పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు



తాటిపర్తిలో యాలకులు, లవంగాల అలంకరణలో అపర్ణాదేవి



కొమరగిరిలో గాయత్రీదేవి అలంకరణలో బాలకనకదుర్గమ్మ



అన్నపూర్ణాదేవి అవతారంలో భువనేశ్వరి అమ్మవారు



పెదకలవలదొడ్డిలో విశేష అలంకరణలో జగన్మాత



అన్నపూర్ణాదేవి అవతారంలో కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో పురుహూతికా అమ్మవారు



పాదగయ క్షేత్రంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి